నమస్తే తెలంగాణ

కరీంనగర్

5 | కరీంనగర్, బుధవారం 30 ఏప్రిల్ 2025 | KARIMNAGAR


# సీతమ్మ లొద్దిలో ఎపిగ్రఫీ సర్వే

పురాతన శాసనాల గుర్తింపు

పెద్దపల్లి, ఏప్రిల్ 29(నమస్తే తెలంగాణ): జిల్లాలోని గుండారం రిజర్వ్ ఫారెస్ట్ లోపల ఉన్న సీతమ్మలొద్దిలో మంగళవారం భారత పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) సాహసోపేతమైన సర్వే చేపట్టింది. ఈ సర్వేను ఎపిగ్రఫీ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి, భారత పురావస్తు సర్వే బృందం నిర్వహించగా, శిలపై చెక్కి ఉన్న శాసనాలను పరిశీలించింది. ఈ సందర్భంగా సర్వే అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్రలో మొత్తం 11 పురాతన శాసనాలను ఎస్టాం పేజీలో తీసుకున్నామన్నారు. క్రీస్తుపూర్వం 1వ శతాబ్దం నుంచి 6వ శతాబ్దం వరకు ఉన్న ఈ శాసనాలు దక్కన్ ప్రాంత ప్రారంభ చరిత్ర, సాంస్కృతిక పరిణామం గురించి ముఖ్యమైన అంతరష్టులను అందిస్తాయని చెప్పారు. ఇక్కడ ఒక ప్రముఖ శిలపై అన్ని శాసనాలు చెక్కబడి ఉన్నాయని, ఈ శాసనాలలో కొన్ని శాతవాహన కాలానికి చెందినవిగా గుర్తించినట్లు చెప్పారు. ముఖ్యంగా శాతావాహన రాజవంశానికి చెందిన కుమార ఆకు సిరికి సంబంధించిన రెండు శాసనాలు ఈ ప్రదేశంలో మొదటిసారిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇది భారతీయ శిలాశాసన రంగంలో అత్యంత ముఖ్యమైన ఆవిష్కరణను సూచిస్తుందన్నారు. అలాగే, లిఖిత గ్రంథాలలో కొన్ని శాసనాలు ఉన్నాయని, ఈ ప్రదేశం పాలియోలిథిక్ నుంచి చారిత్రక కాలాల వరకు కొన్ని ముఖ్యమైన శిలా చిత్రాలకు నిలయంగా ఉన్నట్లు తెలుస్తున్నదన్నారు. ఈ చిత్రాలు ఎరుపుతెలుపు, పసుపు వర్ణద్రవ్యాలలో చిత్రీకరించినట్లు తెలిపారు. గుండారం సాంస్కృతిక, పురావస్తు ప్రొఫైల్‌ను సుసంపన్నం చేస్తాయన్నారు. ఈ యాత్ర సర్వేలో భాగంగా ఫీల్డ్ వర్క్‌ను విస్తృతంగా డాక్యుమెంట్ చేసిన ప్రముఖ ఫొటో జర్నలిస్ట్ డీ రవీందర్‌రెడ్డి, సైట్ దృశ్య వారసత్వం వివరణ, సందర్భోచిత విశ్లేషణకు దోహదపడిన రాక్ ఆర్ట్ పెయింటింగ్ స్పెషలిస్ట్ బీఎం రెడ్డి, అటవీ శాఖ రేంజర్ నాయక్ ఉన్నారు.



సీతమ్మ లొద్దిలో పరిశీలిస్తున్న చరిత్ర పరిశోధకులు



బారులు తీరిన విద్యార్థులు

## ప్రశాంతంగా ఎప్‌సెట్

తిమ్మాపూర్, ఏప్రిల్29 : ఎప్ సెట్ మొదటిరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఫార్మసీ, అగ్రికల్చర్ విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించారు. కరీంనగర్ జోన్ పరిధిలో కరీంనగర్, హుజూరాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, సిద్దిపేటలో 12 సెంటర్లు ఏర్పాటు చేయగా, ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల మధ్య రెండు సెషన్లు పరీక్ష నిర్వహించారు. అన్ని సెంటర్లలో కలిపి ఉదయం 2860 మందికి 2704 మంది హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం 2860 మంది విద్యార్థులకు 2694మంది హాజరయ్యారు. సందర్శించి, పరీక్షా విధానాన్ని పరిశీలించారు.



## భానుడి భగభగ.. శ్రమజీవి విలవిల

ఉదయం 9గంటల నుంచే భానుడి సెగలు.. మధ్యాహ్నం కల్లా నిప్పులు.. సాయంత్రం దాకా భగభగలు.. ఇలా కొద్ది రోజులుగా ఎండ దంచికొడుతున్నది. ఉమ్మడి జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటగా.. నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడుతుండగా, శ్రమజీవులు మాత్రం ఇలా ఎండలోనే పనిచేయాల్సి వస్తున్నది. మరోవైపు వడదెబ్బలతో మరణాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. **- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

## నిర్లక్ష్యం.. నిరుపయోగం

అధికారుల పర్యవేక్షణ లోపంతో కొరవడిన 'చెత్త'శుద్ధి



మెట్‌పల్లి రూరల్: చౌలమద్ది కంపోస్టు షెడ్డు ముందు పారబోసిన చెత్త

గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చడంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో కంపోస్టు షెడ్లను నిర్మించింది. ప్రస్తుతం ప్రభుత్వం పట్టించుకోకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపంతో నిరుపయోగంగా మారిపోతున్నాయి. ఇందుకు నిదర్శనమే ఇక్కడ కనిపిస్తున్న దృశ్యం. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని చౌలమద్ది శివారులో కంపోస్టు షెడ్డు ఉన్నా.. గ్రామంలోని చెత్తనంతా ఇలా షెడ్డు ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. దీంతో గాలులు, వర్షాలకు చెత్తంతా చుట్టుపక్కల విస్తరిస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి కంపోస్టు షెడ్డు నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టి గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**- మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 29**

# సర్కారు కాలేజీలు ఫెయిల్!

- ఇంటర్ ఫలితాల్లో నేలచూపులు.. భారీగా తగ్గిన ఉత్తీర్ణత
- రాయికల్ కళాశాలలో 70 మందికి ఒక్కరే పాస్
- మల్లాపూర్‌లో 110 మందికి నలుగురే
- రిజల్ట్‌పై ఇంటర్ అధికారుల సమీక్ష
- పిల్లలు కాలేజీకి రావడం లేదని, తమనేం చేయమంటారని లెక్చరర్ల వ్యాఖ్యలు
- గట్టిగా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని సమాధానం
- ఇక ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలు ప్రశ్నార్థకమే అంటున్న నిపుణులు
- లెక్చరర్ల మధ్య ఆధిపత్య పోరు వల్లే ఈ దుస్థితి అంటున్న విద్యావేత్తలు




విశాలమైన తరగతి గదులు, మైదానాలు, గ్రంథాలయాలు, అనుభవజ్ఞులైన లెక్చరర్లతో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలు తమ ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగి, వేలాది మందికి విద్యనందించి, ఉత్తీర్ణతలో ఉన్నతంగా నిలిచిన ఈ కళాశాలలు కాంగ్రెస్ పాలనలో వెనుకబడిపోతున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీల రిజల్ట్‌తో పోటీ పడలేక చతికిలపడిపోతున్నాయి. అందుకు ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. లెక్చరర్ల మధ్య ఆధిపత్య పోరు వల్లే ఈ దుస్థితి వచ్చిందని విద్యావేత్తలు అంటుండగా, ఇక ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలు ప్రశ్నార్థకమే అంటున్న నిపుణులు పేర్కొంటున్నారు.

జగిత్యాల, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టారు. కోట్లాది రూపాయల నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు కల్పించారు. ప్రయోగశాలలను ఆధునీకరించారు. బీర్‌పూర్, ధర్మారం, సారంగాపూర్, కొడిమ్యాల వంటి మారుమూల ప్రాంతాల్లో కాలేజీల భవనాల నిర్మాణాలు పూర్తి చేశారు. సమైక్య రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులు సైతం కనీస ఫీజును చెల్లించాల్సి ఉండగా, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి ఉచితంగా మార్చివేశారు. దీనికి తోడు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సౌకర్యాలతో పాటు, జూనియర్ కాలేజీల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసులను క్రమబద్ధీకరించారు. దీంతో అన్ని జూనియర్ కాలేజీలు పూర్తిస్థాయి బోధన సిబ్బంది అందుబాటులోకి వచ్చి నాణ్యమైన విద్య అందింది.

### పడిపోతున్న ఫలితాలు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరాలని ఎంతగా ప్రచారం చేస్తున్నా, ప్రయత్నం చేస్తున్నా విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం రెండు విద్యా సంవత్సరాలుగా వస్తున్న ఫలితాలే అని చెప్పక తప్పదు. దశాబ్దకాలంగా 70 శాతానికి పైగా ఫలితాలతో దూసుకుపోయిన జగిత్యాల జిల్లా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, వరుసగా రెండేళ్లుగా అందుకు విరుద్ధమైన ఫలితాలను నమోదు చేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. తాజాగా ఈ నెల 22న విడుదలైన ఫలితాలు నేలచూపు చూశాయి. చాలా కాలేజీలు మెరుగైన ఫలితాలు సాధించలేకపోయాయి. జిల్లాలోని 15 ప్రభుత్వ జూనియర్ కాలేజీల నుంచి ఇంటర్ ఫస్టియర్ (జనరల్)లో 2,304 మంది పరీక్షలు రాయగా, కేవలం 1006 మంది (43.66శాతం ) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. జనరల్ విభాగంలో 1758 మంది హాజరు కాగా, అందులో 752 మంది (42.77 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 546 మంది పరీక్ష రాయగా, 254 మంది (46.52 శాతం) ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా జిల్లా సగటు (ప్రైవేట్, రెసిడెన్షియల్ కాలేజీల సంఖ్యను కలుపుకొని) 51.44 శాతం కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీల ఫస్టియర్ ఫలితాలు కేవలం 43.66 శాతమే వచ్చాయి. ఇక సీనియర్ ఇంటర్ ఫలితాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. జిల్లా సగటు ఫలితాలు 67.30 శాతంగా నమోదయ్యాయి. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీలు మాత్రం జిల్లా సగటు కంటే తక్కువగా నమోదు చేశాయి. సెకండియర్‌లో జనరల్ కేటగిరిలో 1,812 మంది హాజరుకాగా, 1052 మంది (58.02 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో 527 మందికి 368 మంది (69.82 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జనరల్, ఒకేషనల్ కలిసి జిల్లా ప్రభు త్వ కాలేజీల సగటు 60.70 శాతంగా నమోదైంది. ఇది జిల్లా సగటు కంటే 7.30 శాతం తక్కువగా ఉండడం గమనార్హం.

> **70 మందిలో ఒక్కరే పాస్**
>
> అది రాయికల్ మండల కేంద్రంలోని ఘనమైన చరిత్ర కలిగిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ. నాలుగున్న దశాబ్దాల క్రితమే ఏర్పాటైన కళాశాలలో చదివిన వేలాది మంది విద్యార్థులు పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఈ యేడాది ఇంటర్ ఫస్టియర్ జనరల్ కేటగిరీ విభాగంలో పరీక్షలకు 70 మంది హాజరుకాగా, ఉత్తీర్ణత సాధించింది కేవలం ఒక్క విద్యార్థే. సెకండియర్‌లో 66 మంది హాజరైతే, పాస్ అయ్యింది ఐదుగురే. అలాగే మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీది మరో కథ. 110 మంది విద్యార్థులు ఫస్టియర్ పరీక్షలు రాస్తే పాసైంది కేవలం నలుగురే. సెకండియర్ నుంచి పరీక్షలు రాసింది 92 మందైతే గట్టెక్కింది 19 మంది మాత్రమే. కనీస ఫలితాలు సైతం నమోదు చేయలేని దుస్థితిలోకి వెళ్లిపోవడాన్ని చూస్తే, జూనియర్ కాలేజీల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### మేమేం చేయగలం?

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫలితాలు తక్కువగా నమోదు కావడంతో ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు గత బుధవారమే సమీక్షించారు. ముఖ్యంగా జగిత్యాల బాలుర కాలేజీ, మల్లాపూర్, రాయికల్, కథలాపూర్, గొల్లపల్లి, ధర్మపురి కాలేజీల్లో అతి తక్కువగా ఫలితాలు ఎందుకు వచ్చాయని చర్చించినట్లు తెలుస్తున్నది. 80 శాతం ఫలితాల కంటే తక్కువ సాధించిన లెక్చరర్లను సమీక్షకు హాజరు కావాలని ఆదేశించగా, చాలా తక్కువ మంది హాజరైనట్లు సమాచారం. సమీక్షలో తక్కువగా ఫలితాలు ఎందుకు నమోదయ్యాయని విచారిస్తే, లెక్చరర్లు చెప్పిన కారణాలు విని ఉన్నతాధికారులు బిత్తరపోయినట్లు తెలుస్తున్నది. తమ కాలేజీ పట్టణానికి దాదాపు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉందని, పిల్లలు రావడం లేదని, అందుకే ఫలితాలు రాలేదని ఒక కాలేజీ లెక్చరర్లు చెబితే, మరో కాలేజీ లెక్చరర్ విద్యార్థులు కాలేజీకి రావడం లేదని, ఎందుకు అని ప్రశ్నిస్తే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరిస్తున్నారని. అందుకే తాము ఏం చేయలేకపోతున్నామని, ఇది ఫలితాలపై ప్రభావం చూపిందని చెప్పినట్టు తెలుస్తున్నది. మరి కొందరు లెక్చరర్లు, ప్రభుత్వ కాలేజీలకు వచ్చే విద్యార్థుల్లో పస ఉండడం లేదని, క్రీమ్ స్టూడెంట్స్ అంతా ప్రైవేట్ కాలేజీలకు పోతున్నారని, స్క్రాప్ లాంటి విద్యార్థులతో ఈ పాటి ఫలితాలు సాధించడమే గొప్ప అంటూ వ్యాఖ్యానించడంతో ఉన్నతాధికారులు బిత్తరపోయినట్లు తెలుస్తున్నది

### లెక్చరర్ల అంతర్గత సమస్యలే కారణమా..?

జూనియర్ కాలేజీల్లో ఫలితాలు సరిగా నమోదు కాకపోవడానికి, లెక్చరర్ల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు, ఆధిపత్య పోరే కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లెక్చరర్లు ఇంటర్ బోర్డు నిర్దేశించిన డ్యూటీలను తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని, అంకిత భావంతో పనిచేయడం లేదన్న విమర్శలున్నాయి. పిల్లల ఉత్తీర్ణత కోసం ఇంటర్‌బోర్డు 90 రోజుల ప్రణాళికను నిర్దేశించారు. అయితే చాలా మంది లెక్చరర్లు ఈ ప్రణాళికను కేవలం టీచింగ్ డైరీలో రాసి క్షేత్రస్థాయిలో అమలు చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక లెక్చరర్ల విషయాల్లో ఏర్పడ్డ మూడు సంఘాలు మధ్య అంతర్గత ఆధిపత్య పోరాటం సాగుతున్నట్టు తెలుస్తున్నది. ఇంటర్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంపై దృష్టి పెట్టకుండా, ప్రాక్టికల్, థియరీ పరీక్షల్లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్, అసిస్టెంట్ సూపరింటెండెంట్, స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ డ్యూటీల కోసం సిగపట్లు పట్టినట్టు తెలుస్తున్నది. సీనియర్లు, జూనియర్లు, ఎక్కువ డ్యూటీలు, తక్కువ డ్యూటీలు, అంటూ దాదాపు రెండు నెలల కాలం వాటిపైనే దృష్టి సారించారని, తమను పట్టించుకోలేదని విద్యార్థులే చెబుతున్నారు. జిల్లాలో అతి తక్కువ ఫలితాలను నమోదు చేసిన ఒక జూనియర్ కాలేజీకి చెందిన విద్యార్థులు మాట్లాడుతూ 'మా లెక్చరర్లు ఎప్పుడు సరిగా పాఠాలు చెప్ప లేదు. జనవరి నుంచే ఎగ్జామ్ డ్యూటీలు అంటూ తిరిగారు. మాకు సబ్జెక్టే అర్థం కాలేదు. ఇగ పాస్ ఎట్ల అయితం' అంటూ వాపోయారు.

### తలలు పట్టుకుంటున్న అధికారులు

ప్రభుత్వ కాలేజీల్లో అతి తక్కువ ఫలితాలు నమోదు కావడంతో ఇంటర్ బోర్డు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రిన్సిపాల్స్‌ను బాధ్యులను చేస్తూ వివరణ కోరినట్లు తెలుస్తున్నది. మెరుగైన ఫలితాలు వచ్చినప్పుడే పిల్లల అడ్మిషన్ల కోసం ఇబ్బందులు పడ్డామని, ఇప్పుడు ఫలితాలు తగ్గడంతో ప్రవేశాలు ఎలా వస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా మెరుగైన ఫలితాలను సాధించేందుకు ప్రయత్నించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

> **అడ్వాన్స్‌డ్ సప్లీలో మంచి ఫలితాలు సాధిస్తాం**
>
> ఇంటర్ ఫలితాలు గతంతో పోలిస్తే నాలుగైదు శాతం పెరిగాయి. అయితే అనుకున్న స్థాయిలో రాలేదు. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల రిజల్ట్ బాధపెట్టింది. దీనిపై లెక్చరర్లు, ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష చేసుకుంటున్నాం. ఎక్కడ ఇబ్బంది వచ్చిందో గుర్తిస్తాం. లెక్చరర్ల వద్ద నుంచి, ప్రిన్సిపాళ్ల వద్ద నుంచి వివరణ తీసుకుంటున్నాం. అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం. **- బొప్పరాతి నారాయణ, ఇంటర్‌బోర్డు అధికారి (జగిత్యాల)**



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

# ఇబ్బందులు పెట్టినా సభ సక్సెస్ చేశాం

- మంత్రులు అవాకులు చెవాకులు పేలొద్దు
- నవోదయ పాఠశాలను నియోజకవర్గం నుంచి తరలించొద్దు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల, ఏప్రిల్ 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా రజతోత్సవ సభను సక్సెస్ చేశామని, సభ గురించి మంత్రి స్థాయిలో ఉన్నవాళ్లు అవాకులు, చెవాకులు పేలొద్దని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హితవు పలికారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడుగడుగునా పోలీసులు, రవాణా శాఖ సిబ్బంది ఇబ్బంది పెట్టినా సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తెలంగాణవాదులు తండోప తండాలుగా వచ్చి కేసీఆర్‌పై ప్రేమతో సభను సక్సెస్ చేశారన్నారు. సభ అయిపోయిన వెంటనే కేసీఆర్, సభపై కాంగ్రెస్ మంత్రులు తమ అక్కసు వెల్లగక్కారని విమర్శించారు. సభను సక్సెస్ చేసి ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను చెప్పకనే చెప్పారని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ధర్మపురి నియోజకవర్గంలోని స్తంభంపల్లి గ్రామంలో 50 ఎకరాల్లో సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాలకు మంజూరు చేశామన్నారు. 1009, 09 సర్వే నంబర్లలో ఈ భూమిని కేటాయించామని, ఎన్నికలు రావడంతో కళాశాల ఏర్పాటుకు అంతరాయం ఏర్పడిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కళాశాలను ఏర్పాటుకు చొరవ తీసుకోవడం లేదని, మంజూరైన కళాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం మానకొండూర్ అసెంబ్లీకి తరలించేలా ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇది సరికాదని, కావాలంటే మానకొండూర్‌లో ఇంకో కళాశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నవోదయ పాఠశాల కూడా నిజామాబాద్ ప్రాంతానికి తరలినట్లు సమాచారం వచ్చిందని, వీటిని తప్పనిసరిగా ధర్మపురి నియోజకవర్గంలోనే ఏర్పాటు చేసేలా ప్రస్తుత ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, నాయకులు ఆనంద్‌రావు, తుమ్మ గంగాధర్, జలంధర్, మాధవరావు, ఆనందరావు, వొల్లెం మల్లేశం, వెంకటేశ్వర్‌రావు, గంగారెడ్డి, రిజ్వాన్, ప్రతాప్, సన్నిత్‌రావు, ప్రణయ్ పాల్గొన్నారు.



ఇల్లందకుంట మండలం సిరిసేడు రాస్తారోకో చేస్తున్న మహిళలను లాక్కెళ్తున్న పోలీసులు

# ఇందిరమ్మ ఇండ్లకు మేం అర్హులం కాదా?

- మాకెందుకు ఇవ్వరంటూ పలువురి ఆందోళన
- అనర్హులకు ఇచ్చారని ఆగ్రహం
- సిరిసేడులో రోడ్డుపై మహిళల ధర్నా
- జమ్మికుంటలో మున్సిపల్ భవనం ఎక్కిన దివ్యాంగుడు

హుజూరాబాద్/ ఇల్లందకుంట ఏప్రిల్ 29 : అర్హులమైనా తమకు ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదని మంగళవారం పలువురు ఆందోళనబాట పట్టారు. ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకు మంజూరయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు రోడ్డెక్కి ధర్నా చేశారు. మహిళలు వాటర్ ట్యాంక్ ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని కిందికి దించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నోళ్లకే ఇల్లు మంజూరు చేశారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు ఇచ్చింది ఏమీ లేదని అగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కాంగ్రెస్ వాళ్లు నాలుగు బ్యాచులుగా విడిపోయి వాళ్లకు కావాల్సిన వారికి ఇళ్లు ఇప్పించుకున్నారని వాపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ధర్నా విరమింపజేశారు.

### జమ్మికుంటలో దివ్యాంగుడు

జమ్మికుంట ఏప్రిల్ 29 : ఆబాది జమ్మికుంటకు చెందిన దివ్యాంగుడు దొంకటి కోటేశ్వర్ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని ఆందోళన చేశాడు. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో బల్దియా కార్యాలయం పైకి ఎక్కి తన నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా కోటేశ్వర్ మాట్లాడుతూ, తన అమ్మ మధునమ్మ, తాను ఇద్దరం దివ్యాంగులమని, తనకు పెళ్లయిందని, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, ఆటో నడుపుకొంటూ జీవిస్తున్నానని, రేకుల షెడ్డులో ఉంటున్నాని చెప్పాడు. ఇటీవల 160 మందికి ఇండ్లు వచ్చినట్టు పేర్లు చదివారని, అందులో త న పేరు లేదని సర్వే అధికారులను ప్రశ్నిస్తే.. 'కాంగ్రెస్ నాయకులు ప్రణవ్ లిస్టు ఇ చ్చాడు. ఆయనను అడుక్కో' అని చెప్పడం బాధించిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మున్సిపల్ కార్యాలయానికి వస్తే ఎవరూ పట్టించుకోలేదని, చేసేదేమీ లేక మున్సిపల్ కార్యాలయం ఎక్కి నిరసన తెలిపానని చెప్పాడు. దివ్యాంగులకు 5 శాతం కోటా కింద తనకు రావాల్సి ఉండగా.. తనకే కాదు, ఏ ఒక్క దివ్యాంగుడికీ ఇల్లు రాలేదని తెలిపాడు. తన పేరు అధికారులు, కాంగ్రెస్ నాయకులు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. కాంగ్రెస్ లీడర్లకే ఇళ్లు వచ్చాయని, వాళ్ల తల్లిదండ్రులు, భూస్వాములకే ఇచ్చారని పేర్కొన్నాడు. తనలాంటి దివ్యాంగుడికి ఒక్క ఆసరా పింఛన్ తప్ప ఏ ప్రభుత్వ పథకం చేరడం లేదన్నాడు. తనకు న్యాయం జరగకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించాడు. కాంగ్రెస్ నాయకులు, అధికారులు డౌన్‌డౌన్ అంటూ నినదించాడు. అనంతరం అధికారులు, సిబ్బంది దివ్యాంగుడితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించాడు.




జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంపై నిరసన తెలుపుతున్న దివ్యాంగుడు కోటేశ్వర్





